క్లుప్తంగా

వ్యాపారులు ఆన్‌లైన్‌లో ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలి



నర్సంపేట : స్థానిక మున్సిపాలిటీ పరిధిలో వ్యాపారం చేస్తున్న వర్తకులు ఆన్‌లైన్‌లో ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు కోరారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో వర్తక, వాణిజ్య యూనియన్లతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తగా వ్యాపారం చేపట్టిన వ్యక్తులు ఆన్‌లైన్‌లో లైసెన్స్ తీసుకోవాలని, గతంలో తీసుకున్న వ్యాపారస్తులు రెన్యూవల్ చేసుకోవాలని తెలిపారు. లేనిపక్షంలో షాపులను సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఎల్లమ్మ తల్లికి బోనం



నల్లబెల్లి : మండల కేంద్రంలో దిండు దేవేందర్ కుటుంబ సభ్యులు సోమవారం రాత్రి ఎల్లమ్మ తల్లికి ఘనంగా పూజలు నిర్వహించారు. ఇంట్లో తయారు చేసిన బోనాన్ని పూజారి ప్రవీణ్ తలపై పెట్టుకుని డప్పుచప్పుళ్ల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి గ్రామ దేవతలకు జలాభిషేకం చేశారు. అనంతరం బోనాన్ని నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించారు.

కమిటీ ఎన్నిక



నర్సంపేట : బీసీ సంక్షేమ సంఘం అనుబంధ ఆర్టీసీ స్థానిక డిపో కమిటీని ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గొలనకొండ వేణు, ప్రధాన కార్యదర్శి మాదారపు సాంబయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ వేముల రవి ఆధ్వర్యంలో సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కందికొండ మోహన్, కార్యదర్శిగా గోడిశాల నవీన్, గౌరవ అధ్యక్షుడిగా పెండెం రామానంద్, వర్కింగ్ ప్రెసిడెంట్‌లుగా కొలిశెట్టి రంగయ్య, ఆవునూరి రమ, బత్తిని రవి, గ్యారెజ్ సెక్రటరీగా సబ్బాని రమేశ్, ఉపాధ్యక్షుడుగా బొడిగె రాజు, కోశాధికారిగా నామాల అశోక్, ముఖ్య సలహాదారుగా బత్తిని సాంబయ్య ఎన్నికయ్యారు. అనంతరం గౌరవ అధ్యక్షుడు రామానంద్‌ను శాలువా కప్పి పూలమాలలు వేసి సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివరాత్రి దుర్గయ్య, జిల్లా ముఖ్య సలహాదారు ఎంఎస్.రావు, నాయకులు నాగిశెట్టి ప్రవీణ్, సోమ మాధవ్, కావాటి లింగయ్య, గుండెబోయిన హరిప్రసాద్, వాకిటి నర్సయ్య, మల్లికార్జున్, డొలాకర్ రాజు, బోగోజు రవీందర్, బూర ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

‘బీసీ పవర్’ కార్యదర్శిగా రాజు



బీసీ పవర్ నర్సంపేట నియోజకవర్గ కార్మిక విభాగ ప్రధాన కార్యదర్శిగా పట్టణానికి చెందిన పొనగంటి రాజును ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు అబోతు రాజు యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రాజును కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు మోటం కన్నీ, మహిళా జిల్లా అధ్యక్షురాలు వరంగంటి కవిత, డివిజన్ అధ్యక్షురాలు గాదం స్వప్న, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సంగినేని లకన్ తదితరులు అభినందించారు.

బియ్యం అందజేత



నర్సంపేట రూరల్ : నర్సంపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన ఏర్పాటు కోసం ఏబీఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్ సోమవారం 50 కేజీల బియ్యం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. కళాశాలకు వివిధ గ్రామాల నుంచి వస్తున్న పేద విద్యార్థులు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటలకు కళాశాలలో ఉంటూ చదువుకుంటున్న క్రమంలో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయగా తన వంతుగా బియ్యం అందజేసినట్లు తెలిపారు.

ఆర్థికసాయం



గీసుకొండ : మండలంలోని మనుగొండకు చెందిన తుప్పరి కౌసల్య అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఆమెకు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు, సామాజిక సేవకుడు అల్లం బాలకిశోర్‌రెడ్డి సోమవారం రూ.10 వేల సాయం అందజేశారు. ఆయన పంపిన నగదును నాయకులు వీరగోని రాజ్‌కుమార్, అల్లం మల్లారెడ్డి కౌసల్య కుటుంబీకులకు అందించారు. తొలుత కౌసల్యను నాయకులు పరామర్శించారు.

సమయపాలనలో నిర్లక్ష్యం

- కార్యాలయాల్లో అధికారుల కుర్చీలు ఖాళీ
- రైలొచ్చినప్పుడే విధులకు..
- మండల ప్రజలకు తప్పని తిప్పలు



11.30 తర్వాత ఖాళీగా ఉన్న ఎంపీడీఓ కుర్చీ



ఖాళీగా ఉన్న పోస్ట్‌మాస్టర్ కుర్చీ



పశువైద్య కేంద్రం ఎదుట వేచి చూస్తున్న రైతులు

నెక్కొండ : మండలంలో పని చేస్తున్న పలువురు అధికారులు సమయపాలనలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న దుస్థితి నెలకొంది. ఉదయం 10.30 గంటల వరకల్లా విధులకు హాజరు కావాల్సి ఉన్నా వరంగల్, హనుమకొండ ప్రాంతాల నుంచి వస్తున్న కొందరు అధికారులు కృష్ణా ఎక్స్‌ప్రెస్ వచ్చినప్పుడు హాజరవుతున్నారు. ప్రతీరోజు అధికారుల్లో అత్యధికులు కృష్ణా ఎక్స్‌ప్రెస్ వచ్చాకే ఉదయం 11 గంటల తర్వాత తీరికగా కార్యాలయాలకు వస్తున్నారని రైతులు, ప్రజలు తెలిపారు. సోమవారం ఉదయం స్థానిక పోస్ట్‌మాస్టర్ రత్నమాల ఉదయం 11.45 గంటలకు విధులకు హాజరయ్యారు. ఖాతాదారుల సేవింగ్ ఖాతాలను ఆన్‌లైన్ చేస్తుండగానే మధ్యాహ్నం 12.00 గంటలకు లావాదేవీలు నిలిచిపోయాయి. కేవలం 15 నిమిషాలు కూడా సేవలు అందించడం లేదని, గంటల కొద్దీ నిరీక్షించినా తమకు నిరాశే మిగిలిందని ఖాతాదారులు అసహనం వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11.30కు కూడా ఎంపీడీఓ, ఇన్‌చార్జ్ ఎంపీఓ, సూపరింటెండెంట్ కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చిన ప్రజలు, రైతులు అధికారుల కోసం పడిగాపులు కాస్తున్న పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ పశు వైద్యశాలలో కేవలం అటెండర్ మాత్రమే విధుల్లో ఉన్నారు. వైద్యసేవలు కోసం వచ్చిన పలువురు పాడిరైతులు కార్యాలయం ఎదుట గంటలకొద్దీ నిరీక్షించి వెనుదిరిగారు. వైద్యురాలు సెలవులో ఉన్నట్లు తెలిసింది. ఇకనైనా ప్రభుత్వ ఉన్నతాధికారులు స్పందించి మండలంలో విధులు నిర్వహిస్తున్న అధికారులు సకాలంలో విధులకు హాజరయ్యేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

‘స్థానిక’ ఎన్నికల్లో గెలుపు ఖాయం



సమావేశంలో మాట్లాడుతున్న దయాకర్‌రావు

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

రాయపర్తి : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు ఖాయమని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. మండల కేంద్రంలోని బాల్‌రాజ్ దొడ్డిలో పార్టీ మండల అధ్యక్షుడు మూనావత్ నర్సింహనాయక్ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన మండల విస్తృతస్థాయి సమావేశానికి దయాకర్‌రావు హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అనేక హామీలతో ప్రజలను నమ్మించి ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చిందన్నారు. సుమారు 15 నెలల పాలనలో ఎన్నికల హామీలను అమలు చేయకుండా అబద్ధాలతో కాలం వెళ్లదీస్తోందని విమర్శించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మరోసారి ప్రజలను మోసగించేలా గ్రామసభలు నిర్వహించిందని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల సాకుతో నాయకులకు గాలం వేస్తూ కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్నారని ఎద్దేవా చేశారు. పార్టీలో దొంగలెవరైనా ఉంటే బయటకు వెళ్లాలని సూచించారు. గతంలో పార్టీని వీడి కాంగ్రెస్‌లోకి వెళ్లిన వారి దుస్థితిని గమనించాలని సూచించారు. శ్రేణులను కంటికి రెప్పలా కాపాడుకుంటామని చెప్పారు. పార్టీ అధికారంలోకి లేకపోయినా మండలంలో ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి అనేక సేవలు అందిస్తున్నారని తెలిపారు. సమావేశంలో పార్టీ మండల ఎన్నికల ఇన్‌చార్జ్ గుడిపూడి గోపాల్‌రావు, పీఏసీఎస్ చైర్మన్లు రామచంద్రారెడ్డి, జక్కుల వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక



రాయపర్తి : హైదరాబాద్‌లోని గాంధీ భవన్ వేదికగా మండలానికి చెందిన బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బిల్లా సుధీర్‌రెడ్డి, రైతుబంధు సమితి మాజీ మండల అధ్యక్షుడు సురేందర్‌రావు ఆధ్వర్యంలో పలువురు నాయకులు మాజీ ఎంపీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అజహరుద్దీన్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో సోమవారం చేరారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి, సురేందర్‌రావు, తదితరులకు అజహరుద్దీన్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం పార్టీలో చేరిన వారితో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సిరెడ్డి సమావేశమై మాట్లాడారు. కార్యక్రమంలో తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హామ్యానాయక్, పార్టీ మండల అధ్యక్షుడు ఈదుల కంటి రవీందర్‌రెడ్డి, సోమనాథ ఆలయ కమిటీ చైర్మన్ కృష్ణమాచార్యులు, నాయకులు నయీమ్, బిల్లా రాధిక సుభాశ్‌రెడ్డి, చెవ్వ కాశీనాథం, పోగుల కొండ వేణు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

మహిళపై దాడి.. కేసు నమోదు

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ నగర పరిధిలోని 16వ డివిజన్ గరీబ్‌నగర్‌కు చెందిన మహిళపై దాడి చేసిన అదే గ్రామానికి చెందిన కొరదల జంపయ్య, వెంకటేశ్, సమ్మయ్య, సుభద్ర, వరికుప్పల వీరయ్య, సరితపై కేసు నమోదు చేసినట్లు గీసుకొండ ఇన్‌స్పెక్టర్ మహేందర్ తెలిపారు. సోమవారం ఆయన వివరాలు వెల్లడించారు. మైనర్ అయిన బాధిత మహిళ కూతురును గ్రామానికి చెందిన కొరదల శివాజీ మాయమాటలు చెప్పి వెంట తీసుకు వెళ్లగా ఆ విషయమై బాధిత మహిళ ఆమె బంధువులకు ఫోన్ చేసి చెబుతుండగా నిందితులు ఆమె ఇంటిపై ఇనుపరాడ్లతో దాడి చేశారు. తలుపులు పగుల గొట్టారు. బాధితురాలి తలపగిలి తీవ్ర గాయాలు కాగా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



యాకేశ్ (ఫైల్)

చెన్నారావుపేట : మండలంలోని జీడిగడ్డతండాకు చెందిన గుగులోతు కల్యాణి ఆమె భర్త యాకేశ్ అదృశ్యమైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేశ్‌రెడ్డి మీడియాకు తెలిపారు. యాకేశ్ వరంగల్‌లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నాడని చెప్పారు. బ్యాంకుకు వెళ్లిన యాకేశ్ తిరిగి రాకపోవడంతో కల్యాణి ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలుపై హర్షం

వర్ధన్నపేట : రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అమలుకు నిర్ణయించడంపై తెలంగాణ అంబేడ్కర్ సంఘం (టీఏఎస్) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నర్సయ్య హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలోని సంఘం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న వర్గీకరణ సమస్య పరిష్కారానికి అడుగులు పడడం అభినందనీయమని చెప్పారు. జనాభా మేరకు వర్గీకరణ పారదర్శకంగా జరిగేలా కార్యాచరణ చేపట్టాలని సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో ఏ, బీ, సీలుగా నిర్ణయిస్తూ అసెంబ్లీ ఏకగ్రీవంగా తీర్మాణం చేయడం అభినందనీయమని తెలిపారు. సమావేశంలో నాయకులు తాటికాయల వివేకానంద, జంగిలి బాస్కర్, మామిళ్ల చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



పర్వతగిరి : విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ అపర్ణ

పర్వతగిరి : నర్సంపేటలో శోకతాన్ జపాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కరాటే పోటీల్లో మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల స్కూల్, కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ అపర్ణ తెలిపారు. పోటీల్లో 19 మంది విద్యార్థులు ప్రతిభ చాటగా వారిని స్కూల్, కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ సోమవారం అభినందించి మాట్లాడారు. కరాటేతో శారీరక, మానసిక వికాసానికి బాటలు పడతాయని చెప్పారు. కార్యక్రమంలో పీడీ స్రవంతి, పీఈటీ మమత, అధ్యాపకులు పాల్గొన్నారు.

బాలాజీ టెక్నో స్కూల్ విద్యార్థులు..

నర్సంపేట రూరల్ : మండలంలోని లక్నేపల్లి శివారులోని బాలాజీ టెక్నో స్కూల్ విద్యార్థులు జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ కనబర్చి 54 పతకాలు సాధించారని బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి తెలిపారు. విద్యార్థులతోపాటు కరాటే మాస్టర్లను ఆయన అభినందించి మాట్లాడారు. కటాస్, కుమ్తె విభాగాల్లో విద్యార్థులు పాల్గొని 20 బంగారు, 34 వెండి పతకాలు సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, పీఈటీలు రియాజొద్దీన్, రామ్మూర్తి, యాకూబ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శవాణి స్కూల్ విద్యార్థులు..

దుగ్గొండి : నర్సంపేటలో ఇటీవల జరిగిన నేషనల్ ఇన్విటేషన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో మండల కేంద్రంలోని ఆదర్శవాణి విద్యాలయం విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా సదరు విద్యార్థులను స్కూల్ ఆవరణలో కరస్పాండెంట్ రవి సోమవారం అభినందించి మాట్లాడారు. పోటీల్లో 11 మంది గోల్డ్, 5 గురు సిల్వర్, ముగ్గురు రజత పతకాలు సాధించారని చెప్పారు. విద్యార్థులు క్రీడల్లోనూ రాణించేలా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మణికంఠ రవి, డైరెక్టర్ భిక్షపతి, స్రవంతి, దుడ్డె కుమారస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నర్సంపేట రూరల్ : విద్యార్థులతో చైర్మన్



దుగ్గొండి : విద్యార్థులతో ప్రిన్సిపాల్, తదితరులు

క్రీడలతో బంగారు భవిష్యత్‌కు బాటలు



ప్రతిభ చాటిన విద్యార్థులతో హర్షవర్ధన్, తదితరులు

- ఏబీవీపీ జిల్లా కార్యదర్శి హర్షవర్ధన్

వర్ధన్నపేట : క్రీడల్లో రాణిస్తూ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవచ్చని ఏబీవీపీ జిల్లా కార్యదర్శి కుంట హర్షవర్ధన్ తెలిపారు. పట్టణంలో గత నెల 28 నుంచి 30 వరకు నిర్వహించిన క్రీడాపోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు సోమవారం ఆయన బహుమతులు అందజేసి మాట్లాడారు. విద్యార్థుల హక్కుల సాధన, సమస్యల పరిష్కారంతోపాటు వారు అన్ని రంగాల్లో రాణించే దిశగా ప్రోత్సహించడమే లక్ష్యంగా సంఘం కార్యాచరణ చేపడుతోందని తెలిపారు. క్రీడలతో శారీరక, మానసిక వికాసం పెంపొందుతుందని చెప్పారు. విద్యార్థులు ఆటపాటల్లోనూ రాణించాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కన్వీనర్ గజ్జల దేవేందర్, స్పోర్ట్స్ కన్వీనర్ బెల్లం కార్తీక్, నాయకులు అజయ్, సన్నీ, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎన్నికల అధికారులకు శిక్షణ

దుగ్గొండి : స్థానిక సంస్థల ఎన్నికలను పురస్కరించుకుని నేడు (మంగళవారం) మండల పరిషత్ కార్యాలయంలో దుగ్గొండి, నల్లబెల్లి మండలాలకు చెందిన రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు (ఆర్‌ఓ, ఏఆర్‌ఓ) శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీఓ లెక్కల అరుంధతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా నామినేషన్ల స్వీకరణలో అధికారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. సంబంధిత ఉద్యోగులు సకాలంలో శిక్షణకు హాజరు కావాలని కోరారు.

రాష్ట్రంలో రైతు వ్యతిరేక పాలన



నల్లబెల్లి : నిరసన తెలుపుతున్న సుదర్శన్‌రెడ్డి, నాయకులు, రైతులు

- నియోజకవర్గవ్యాప్తంగా నిరసనలు

సాక్షి నెట్‌వర్క్ : రాష్ట్రంలో కాంగ్రెస్ రైతు వ్యతిరేక పాలన సాగిస్తోందని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విమర్శించారు. రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లాలోని నల్లబెల్లి, చెన్నారావుపేట, దుగ్గొండి, నెక్కొండ, ఖానాపురం మండలాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నల్లబెల్లిలో ఎడ్లబండ్లతో నిరసనా ర్యాలీ నిర్వహించగా మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ మోసపూరిత పాలనకు వ్యతిరేకంగా పోరాడాలని చెప్పారు. హామీలు నెరవేర్చకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు వస్తే తిరుగుబాటు చేయాలని సూచించారు.

ఎన్నికల హామీల అమలులో మోసం

- మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తోందని స్థానిక మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విమర్శించారు. పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు రైతుభరోసా, రుణమాఫీ, తదితర ఏ హామీని కూడా పూర్తిస్థాయిలో నెరవేర్చలేదని చెప్పారు. రైతు బంధు ఇవ్వకుండా రైతులను వేదనకు గురి చేసిందన్నారు. ఎమ్మెల్యేకు చెందిన కంపెనీకి బిల్లులు వస్తుండగా రైతులకు బోనస్ ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గట్టిగా బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో రాష్ట్ర సమన్వయ సమితి మాజీ డైరెక్టర్ రాయిడి రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకట్‌నారాయణ, మాజీ ఎంపీపీ నల్లా మనోహర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ, క్లస్టర్ బాధ్యులు బండి రమేశ్, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, పట్టణ కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, ప్రచార కార్యదర్శి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గురిజాల వద్దు.. చెన్నారావుపేట ముద్దు..



ధర్నా చేస్తున్న పాత ముగ్దుంపురం నాయకులు, గ్రామస్తులు

- ప్రధాన రహదారిపై గ్రామస్తుల ధర్నా

చెన్నారావుపేట : ‘గురిజాల వద్దు.. చెన్నారావుపేట ముద్దు..’ అంటూ గ్రామస్తులు నర్సంపేట–నెక్కొండ ప్రధాన రహదారిపై సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఉపసర్పంచ్ మేకల సదయ్య, నాయకులు సయ్యద్ బషీర్, నాంపెల్లి మల్లయ్య, పోలెపల్లి రమేశ్, సుంకరి సాంబయ్య మాట్లాడారు. పాత ముగ్దుంపురం గ్రామాన్ని గతంలో నర్సంపేట మండలంలో విలీనం చేయగా నాటి ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని గ్రామస్తులు కలిసి సమస్యను వివరించగా చెన్నారావుపేటలోనే కొనసాగించడానికి జీఓ తీసుకొచ్చారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఎంపీటీసీ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే గ్రామాన్ని గురిజాలలో కలిపారని ఆందోళన వెలిబుచ్చారు. గ్రామాన్ని చెన్నారావుపేటలో కొనసాగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోలీసులు చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడి ధర్నా విరమింపజేశారు. కార్యక్రమంలో నాయకులు షేక్ యాకూబ్, పఠాన్, నాగులు, వసంత, లక్ష్మి, కొమురమ్మ, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



రిషిని అభినందిస్తున్న హెచ్‌ఎం జయ

చెన్నారావుపేట: ఎస్‌జీఎఫ్ఐ జాతీయ స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఉప్పరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి రిషి ఎంపికైనట్లు హెచ్ఎం జయ తెలిపారు. ఈ మేరకు పాఠశాల ఆవరణలో సోమవారం విద్యార్థి రిషి, వ్యాయామ ఉపాధ్యాయురాలు స్వప్నలను అభినందించారు. అనంతరం హెచ్ఎం మాట్లాడుతూ 7వ తరగతి చదువుతున్న బండారి రిషి ఇటీవల జరిగిన జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి ఈ నెల 12, 13, 14, 15, 16 తేదీల్లో మహారాష్ట్రలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీత, రాగి శశిధర్, సంతోష్‌కుమార్, బాలాజీరావు, ఉదయ్‌కుమార్, మాధవి, మొగిళి, సుందర్, మాధవి, సతీష్‌కుమార్, రమాదేవి, రామకృష్ణ, జాహేద్, ఇందిర పాల్గొన్నారు.

ఆధార్ శిబిరాన్ని వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ కృష్ణ

నల్లబెల్లి : మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఆధార్ శిబిరాన్ని మండల ప్రజలు వినియోగించుకోవాలని తహసీల్దార్ కృష్ణ కోరారు. ఆధార్ శిబిరాన్ని సోమవారం ఆయన సందర్శించి సేవలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కృష్ణ మాట్లాడారు. ప్రజలకు స్థానికంగా సేవలు అందించే దిశగా తాత్కాలికంగా శిబిరం ఏర్పాటు చేశామన్నారు. శిబిరంలో ఈనెల 15 వరకు ఆధార్ సేవలు అందుతాయని చెప్పారు. పేర్లు, చిరునామా, ఇతర సవరణలతోపాటు ఆధార్ కార్డు తీసుకుని చాలా కాలం అయిన వ్యక్తులు అడ్రస్, ఇతరత్రా వివరాలు అప్‌డేట్ చేయించుకోవాలని సూచించారు.

పరామర్శ

నర్సంపేట : పట్టణంలోని 19వ వార్డుకు చెందిన కీసరి ముత్తమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, కాంగ్రెస్ పార్టీ పట్టణ కమిటీ అధ్యక్షుడు బత్తిని రాజేందర్, రాష్ట్ర ఖనిజ శాఖ మాజీ డైరెక్టర్ నాడెం శాంతికుమార్ పరామర్శించారు. తొలుత మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

నివాళి

రాయపర్తి : మండలంలోని మైలారం, ఊకల్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్తలు గూడెల్లి వెంకన్న, లెక్కల మాధవరెడ్డి మృతి చెందగా వారి మృతదేహాలకు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు నివాళులర్పించారు. అనంతరం మొరిపిరాలలో సీనియర్ కార్యకర్త పారుపల్లి సుధాకర్‌రెడ్డి అనారోగ్యంతో చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటుండగా పరామర్శించారు.

విరాళం

రాయపర్తి : మండలంలోని మైలారంలోని ఎస్సీ కాలనీ ప్రజలకు మారెమ్మ పండగ నిర్వహణ కోసం ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం రూ.20 వేల విరాళం అందజేశారు. తొలుత ఆయన్ను కాలనీకి చెందిన గబ్బెట కుటుంబాలు కలిసి పండగకు ఆహ్వానించాయి. అనంతరం శ్రీనివాస్‌రెడ్డి విరాళం అందించి మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల విభాగం మండల ఇన్‌చార్జ్ గుడిపూడి గోపాల్‌రావు, మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, ఎస్టీ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనానికి..

సంగెం : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన ఏర్పాటు కోసం మండలంలోని చింతలపల్లికి చెందిన కొప్పుల గంగాధర్‌రావు రూ.16,200 విరాళం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాధవరావు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.